క్లుప్తంగా

స్వర్ణ కిరీటానికి బంగారం వితరణ



అర్చకునికి బంగారం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డీసీసీబీ కాలనీలోని భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వెంకటేశ్వరస్వామికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం పలువురు దాతలు తమవంతు సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీ సభ్యులైన చింతాడ కృష్ణారావు దంపతులు ఆదివారం తులం బంగారం సమర్పించారని అర్చకులు గోపాలాచార్యులు తెలిపారు.

3 నుంచి కామాక్షి పీఠంలో నవరాత్రులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పాండ్రంగి వీధిలో వేంచేసిన కామాక్షి పీఠంలో అక్టోబర్ మూడో తేదీ నుంచి దేవీ నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వేదుల వెంకటసూర్యనారాయణశర్మ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి చండీ హోమాలు, తిరువీధి, లలితా పారాయణ జరుగుతాయన్నారు. భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్యాన్సర్‌పై అవగాహన



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం గ్రామంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పురుషులకు నోటి పరీక్షలు చేపట్టారు. కొందరికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోగాకు ఉత్పత్తుల వినియోగం, మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. రోజూ శరీరక శ్రమకు ప్రధాన్యత ఇవ్వాలని సూచించారు.

కళ్లేపల్లిలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం రూరల్: కళ్లేపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత, లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి నరేష్, ఉన్నతి ఆస్పత్రి అధినేత డాక్టర్ బాడాన దేవభూషణరావులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఏ మాత్రం అనారోగ్య లక్షణాలు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. స్థానిక సర్పంచ్ గంగు నరేంద్రకుమార్, బాణ కిషోర్ ఉన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ : యోగా సాధన వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో యోగాసన జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి యోగా పోటీలు జరిగాయి. 10 నుంచి 55 ఏళ్ల వరకు6 కేటగిరీల్లో ట్రెడిషనల్, రిథమిక్ ఆర్టిస్టిక్ విభాగాలలో మహిళలు, పురుషుల విభాగంలో మొత్తం 90 మంది విజేతలుగా నిలిచారు. గెలుపొందిన వారు వచ్చే నెలలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు కార్యక్రమంలో యోగాసనా స్పోర్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ కేదార్నాథ్, జాయింట్ సెక్రెటరీ జి.అర్చన, గురుగుబెల్లి జీవిత, ఉపాధ్యక్షులు తంగి స్వాతి, కొంక్యాన మురళీధర్, కోశాధికారి శ్రీనివాసరావు, సభ్యులు రమ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

వైద్యునికి సత్కారం



అన్నాజీరావును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యులు, ట్రస్ట్ ఆస్పత్రి అధినేత డాక్టర్ బుడుమూరు అన్నాజీరావును మానవతా స్వచ్ఛందసేవా సంస్థ ప్రతినిధులు ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో సేవాసంస్థ ప్రతినిధులు పొన్నాడ రవికుమార్, వైస్ చైర్మన్ నటుకుల మోహన్, ఎమెర్జెన్సీ విభాగ సభ్యులు టిక్కం రాంగోల్, సభ్యులు పాడుగు చరణ్, రామం పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో..



అరసవల్లి సూర్యనారాయణ స్వామిని అవినీతి నిరోధక శాఖ ఎస్పీ ఎం.రజిని తొలిసారిగా ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమెకు ఆలయ ఈవో భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆమె సూర్యనమస్కారాల పూజలను చేయించుకోగా.. అర్చకులు వేదాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు, ఆదిత్యుని జ్ఞాపికలను అందజేశారు. ప్రోటోకాల్ సిబ్బంది, సూపరింటెండెంట్ కనకరాజు ఉన్నారు.

–అరసవల్లి

డాక్టరేట్ ప్రదానం..



ప్రముఖ రంగస్థల కళాకారుడు, నటుడు, దర్శకుడు, రచయిత లోకనాథం రామలింగ స్వామికి అరుదైన గౌరవం దక్కింది. విశాఖలోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గాడ్సన్ హోలీ టెక్నాలాజికల్ ఆకాడమి వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. 1967 నుంచి నాటక రంగానికి చేస్తున్న కృషిని గుర్తించి డాక్టరేట్‌ను అందించారని రామలింగస్వామి తెలిపారు. ఈయనకు కళాకారులు, అభిమానులు అభినందనలు తెలియజేశారు.

–శ్రీకాకుళం కల్చరల్

భగవద్గీత పారాయణం



చిన్మయమిషన్ నిర్వాహకులు పరాత్మానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలోని బలగలోని హరే రామ మందిరంలో ఆదివారం చిన్నారులకు భగవద్గీత తరగతులను బాలవిహార్ నిర్వహించారు. ప్రతి ఆదివారం భగవద్గీత తరగతలను ఏపీహెచ్‌బీ కాలనీలోని ఎంఐజీ 153, నీలమ్మకాలనీలో, బలగ హరేరామ మందిరంలో నిర్వహిస్తున్నామని.. ఎవరైనా తమ పిల్లలను ఇక్కడి పంపవచ్చని చిన్మయ మిషన్ ప్రతినిధి కూనపులి వెంకటేశ్వరులు తెలిపారు. వివరాలకు 9440546282 నంబర్‌ను సంప్రదించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు నవంబర్‌లో భగవద్గీత పోటీలు నిర్వహిస్తామన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

జాగ్రత్తగా వెళ్లవలెను..



కొత్తరోడ్డు బ్రిడ్జి పైనుంచి వెళ్తున్న భారీ వాహనాలు

- బ్రిడ్జి నిర్మాణ పనులపై దృష్టి సారించాలని విజ్ఞప్తి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం కొత్తరోడ్డు నుంచి రాగోలు మీదుగా ఆమదాలవలస వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉన్న విషయం విదితమే. ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతున్నప్పటికీ.. ఈ రోడ్డును ఆనుకొని ఉన్న కొత్తరోడ్ నుంచి కూతవేటు దూరంలో గల పంట కాలువ బ్రిడ్జి కూడా పాడైంది. రెండు వైపులా పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో బ్రిడ్జి కూరుకుపోయింది. బ్రిడ్జి పైనుంచి పెద్ద వాహనాలు వెళ్తే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఒకేసారి వాహనాలు వెళ్లే సమయంలో బ్రిడ్జి కదులుతున్నట్టు ఈ ప్రాంతీయులు చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాగోలు రోడ్డు పనులు నిమిత్తం ఈ బ్రిడ్జి నిర్మాణాలు పనులు కూడా పూర్తిచేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణం ప్రమాదమే



కొత్తరోడ్డు నుంచి కూతవేటు దూరంలో గల బ్రిడ్జి ప్రమాదకర స్థితిలో ఉంది. ఈ బ్రిడ్జి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. పెద్ద వాహనాలు వెళ్తుండడంతో కూలిపోయే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందుగానే మేల్కొని బ్రిడ్జిని కూడా బాగు చేయాలి.

–గడప ఖగేష్, శ్రీకాకుళం

జాగ్రత్తలు తప్పనిసరి



ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు పనుల్లోనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడితే బాగుంటుంది. లేకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తవచ్చు. భారీ వాహనాలను ఇప్పటి నుంచి బ్రిడ్జి పైనుంచి వెళ్లనీయకుండా దారి మళ్లిస్తే బాగుంటుంది.

– చంద్రరావు, రాగోలు

సర్వీస్ రోడ్డుపై వాహనాల పార్కింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిలోని సర్వీస్ రోడ్డుపై వాహనాలు పార్కింగ్ వాహన చోదకులకు ఇబ్బంది మారుతోంది. ఏ మాత్రం అప్రమత్తంగా ఉన్న ప్రమాదాలు జరుగుతున్నాయి. కుశాలపురం బైపాస్, నవభారత్, కొయ్యారాళ్ల కూడళ్ల సమీపంలోని సర్వీస్ రోడ్లపై వాహనాలు ఎక్కడకక్కడ నిలిపివేస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ ట్రాన్స్‌ఫోర్ట్ సప్లయ్ కార్యాలయాలు=న్నాయి. వాస్తవంగా వీరు ప్రత్యేక పార్కింగ్‌ను నిర్వహించాలి. అలాకాకుండా రోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. మరోపక్క సర్వీస్ రోడ్డుపై రాంగ్ రూట్, ట్రాఫిక్ నిబంధనలతో సంబంధం లేకుండా రెండు వైపుల నుంచి వాహన రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పార్కింగ్ వాహనాలు ఉండటం వల్ల స్థల సమస్య సైతం ఇబ్బందిగా మాతోంది. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కొన్నిసార్లు ఢీకొట్టి ప్రమాదాలు జరగుతున్నాయి. ప్రధానంగా వర్షాలు పడేటప్పుడు రోడ్డుపై వాహనాల పార్కింగ్ ఎక్కువగా చేస్తున్నారు. జాతీయ రహదారిపై ఉన్న ఎల్‌ఈడీ లైట్లు సైతం వర్షాలు పడేటప్పుడు వెలగటం లేదు. మారో పక్క రోడ్డుపై చేరుతున్న నీటివల్ల వాహనాలు స్కిడ్ అయ్యే అవకాశం ఉంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు సైతం రాంగ్ రూట్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. యుటర్న్‌లు దూరంగా ఉండటం, సమీప గ్రామాల ప్రజలు వారి గ్రామాలకు చేరేందుకు సర్వీస్ రోడ్డుపై వాహనాలు నడుపుతున్నారు. సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ చేయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



కుశాలపురం బైపాస్ వద్ద సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

3 నుంచి హ్యాపీనెస్ కార్యక్రమం

శ్రీకాకుళం కల్చరల్: దేవీ నవరాత్రులను పురస్కరించుకొని రవిశంకర్ గురూజీ ఆదేశాల మేరకు అక్టోబర్ మూడు నుంచి తొమ్మిదో తేదీ వరకు ప్రత్యేక హ్యాపీనెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవోఎల్ ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు తెలిపారు. స్థానిక పెద్దపాడు రోడ్డులో ఆదివారం స్పెషల్ ఫాలో అప్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనందం, సంతోషం, సంబంధాలు ఈ కార్యక్రమం ద్వారా పొందవచ్చని అన్నారు. టీచర్ దేసూళ సురేంద్ర మాట్లాడుతూ.. యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, సుదర్శన క్రియ నేర్పుతున్నామన్నారు. ప్రత్యేక తరగతులు ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు పెద్దపాడు హ్యాపీనెస్ కేంద్రంలో జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 79897 52675 నంబర్‌రు సంప్రదించాలని కోరారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వలంటీర్లు ఉత్తమ్‌కుమార్, హేమంత్, మోహన్, గొండు అప్పారావు, 45 మంది సాధకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

వ్యవసాయానికి పట్టుకొమ్మ



శ్రీధర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వ్యవసాయానికి శ్రీకాకుళం జిల్లా పట్టుకొమ్మని..ఇక్కడ పనిచేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్ అన్నారు. జేడీ హోదాలో ఉద్యోగ విరమణ చేయడం ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిందన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఉద్యోగ విరమణ సభలో ఆయన మాట్లాడారు. వాటర్ షెడ్ పథకం ద్వారా మంచి కార్యక్రమాలు చేయడం, గిరిజనులతో మమేకమై ఐటీడీఏలో పనిచేయడం సంతృప్తి ఇచ్చాయన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఉద్యోగులు శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రిటైర్డ్ జేడీరామరాజు, వేణుగోపాల్, వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త సత్యన్నారాయణ పాల్గొన్నారు.

అధ్వానంగా తోటపాలెం రోడ్డు



చెరువును తలపిస్తున్న తోటపాలెం రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం నుంచి పొన్నాడ, ధర్మవరం, డి.మత్స్యలేశం వైపు వెళ్లే అర్‌అంబ్‌బీ రోడ్డు పూర్తిగా పాడైంది. తోటపాలెం కూడలి నుంచి వెళ్లే ప్రారంభంలో రోడ్డు చెరువును తలిపిస్తోంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు పాట్లు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదు.

జిల్లా కవులకు సత్కారం



కవి సమ్మేళనంలో పాల్గొన్న జిల్లా కవులు

శ్రీకాకుళం కల్చరల్: అనకాపల్లిలోని గౌరీ గ్రంథాలయంలో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన 139వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన 20 మంది కవులు పాల్గొని కవితలను వినిపించారు. కళావేదిక జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, రమావతి, టీపీ శారధి ఉత్తరాంధ్రా శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు ఈవేమనలు కవులకు పురస్కారాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఉమాకవి 'కవిత్వ కలమా నీకు వందనాలు'అనే కవిత చదివినందుకు పురస్కారాన్ని అందించారు. వీరితో పాటుగా పి.వి.దుర్గాప్రసాద్, మోహన్ గాంధీ, పి.గిరీష్, పీపీఎస్ శాస్త్రి, ఐఎన్‌డీ ప్రసాద్, పి.దేవానంద్, రెడ్డి లలిత, వాడాడ శ్రీనివాస్ తదితరులకు గౌరవం లభించింది.

రణస్థలం/జి.సిగడాం: శ్రీకాకుళం వేమన కవితామయం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖకవి, రచయిత మహ్మద్‌రఫీ (ఈవేమన)కి, టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన రచయిత బమ్మిడి అమ్మాజీకి అనకాపల్లిలో నిర్వహించిన శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కవి సమ్మేళనంలో ఆదివారం సత్కరించారు. అమ్మాజీ రణస్థలం మండలం కోస్టా సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మేము సహితం అనే కవిత అందరి ప్రశంసలు పొందింది. అలాగే జి.సిగడాం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న లలితారెడ్డి స్వీయ కవితా గానం చేశారు. ఈమెను కళావేదిక ప్రతినిధులు అభినందించారు.

వయోవృద్ధులకు గుండె పరీక్షలు

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం రోటరీక్లబ్, జెమ్స్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ప్రశాంతి వృద్ధ జనాశ్రమంలో ఆదివారం వైద్య పరీక్షలు చేశారు. 60 మంది వృద్ధులకు బీపీ, సుగర్, ఈసీజీ, ఇకో గుండె పరీక్షలను వైద్యులు వై.జస్వంత్, ఆర్.హర్షిత, పి.శివమణి చేశారు. ఐదుగురిని మెరుగైన వైద్య పరీక్షల కోసం జెమ్స్‌కు రిఫర్ చేశారు. రోటరీ క్లబ్ కార్యదర్శి దూసి సంతోష్, మెడికల్ డైరెక్టర్ ఎస్.వసంతరావు, జెమ్స్ ఆస్పత్రి డీజీఎం ఎస్.విజయభాస్కర్, వృద్ధాశ్రమం అధ్యక్షులు కొంచాడ సోమేశ్వరరావు, సభ్యులు జైశ్రీరామ్, పి.దుర్గాప్రసాద్, బీఏఎల్ ప్రసాద్, రోటరీ ప్రతినిధులు ఎంఆర్‌కే దాస్ తదితులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

కనకధార స్తోత్రంపై ప్రవచనం

శ్రీకాకుళం కల్చరల్: అన్నింటికి సర్వ సన్నద్ధం కావడమే ఆధ్యాత్మిక అని డాక్టర్ బాచుపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో 'కనకధార స్తోత్రంపై'ఆదివారం ప్రవచనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనస్సుతో ఆచరించడం, ఎటువంటి సమస్యలనైనా అనుభవించడం ఆధ్యాత్మికత అన్నారు. సంసార చక్రంలో పడి సత్య, అసత్యలు తెలుసుకోలేని వారికి శంకరాచార్యులు అందించిన స్తోత్రమే కనకధార స్తోత్రమని వివరించారు. ముందుగా వక్త సంతోష్ కుమార్ శాస్త్రిని మందిరం అధ్యక్షులు గుమ్మా నగేష్, సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పి.పతంజలి శాస్త్రి, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, పి.రవికుమార్, ఎస్.నారాయణమూర్తి, బి.కోమలరావు, జంధ్యాల శరత్‌బాబు, జి.విశ్వేశ్వరరావు, పద్మావతి, లత, రామరత్నం ఉన్నారు.



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న సంతోష్‌కుమార్ శాస్త్రి

అద్దె ఇంట్లో పాఠశాల నిర్వహణ



పాఠశాల గోడ కూలిన దృశ్యం



మరమ్మతులకు గురైన పాఠశాల

- శిథిలమైన కొత్తపేట పాఠశాల భవనం
- పట్టించుకోని అధికారులు

ఎచ్చెర్ల: మండలంలోని మురపాక పంచాయతీ కొత్తపేట గ్రామంలో పాఠశాల శిథిలమైంది. ఇక్కడ ఉన్న పాఠశాల భవనం కూలిపోయి చాలా రోజులైనా పట్టించుకునే నాథుడే లేరు. ఇక్కడ 20 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల శ్లాబ్ మొత్తం పెచ్చులూడిపోవటంతోపాటు గోడ కూలిపోవడం వల్ల పాఠశాలను విడిచిపెట్టారు. దీని స్థానంలో మరోక పాఠశాల భవనం నిర్మించకపోవడం వల్ల గ్రామస్తులు వేరే ఇంటిని అద్దెకు తీసుకుని అందులో పాఠశాలను నడిపిస్తున్నారు. ఇక్కడ చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన తాగునీటి బోర కూడా పాడవ్వడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ముల్లు మహేష్, ప్రగడ శ్రీరాములు, గూనప్ప రాజు, ఆనందరావు, గొర్లె శ్రీరాములు, పిసిని నారాయణరావు తదితరులు చెబుతున్నారు. స్థానిక నాయకులు, అధికారులు ఈ విషయాన్ని పట్టించుకుని తమ పిల్లలకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అద్దెకు తీసుకున్న ఇల్లు

పారా పోటీల్లో దివ్యాంగులు మురిసె!

- స్విమ్మింగ్ పోటీల చాంపియన్ విశాఖ
- జిమ్నాస్టిక్‌లో చిన్నారుల అద్భుత ప్రదర్శన
- రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటిన షూటర్లు



రైఫిల్ షూటింగ్ చేస్తున్న రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ గిరీశ

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో ఆదివారం క్రీడా పండగ జరిగింది. పారా స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, జిమ్నాస్టిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో దివ్యాంగ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. దివ్యాంగ స్విమ్మర్లు పూల్‌లో సత్తాచాటగా.. లక్ష్య సాధనలో రైఫిల్ షూటర్లు పోటీపడ్డారు. జిమ్నాస్టిలు తమ విన్యాసాలతో అలరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ గిరీశ రైఫిల్ షూటింగ్ చేసి ఔత్సాహిక క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ చిన్నారుల విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. పారా స్విమ్మింగ్ పోటీల్లో విజేతలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.

స్విమ్మింగ్‌లో...

రైల్వే స్టేడియం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పారా స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. ఎస్ 4 కేటగిరీ నుంచి ఎస్ 14 వరకు 90 మంది పారా స్విమ్మర్లు పోటీ పడ్డారు. ఫ్రీస్టయిల్, బ్యాక్‌స్ట్రోక్ లాంటి 50, వంద మీటర్ల స్విమ్మింగ్ అంశాల్లో పలువురు దివ్యాంగ స్విమ్మర్లు తమ ప్రత్యేకతను ప్రదర్శించారు. బ్లైండ్(అంధత్వం) పారా స్విమ్మర్లు సైతం వారి కేటగిరీల్లో పోటీ పడి సత్తాచాటారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర జట్టుగా వచ్చే నెల 19 నుంచి 22 వరకు గోవాలో జరిగే పోటీలకు హాజరవుతారు. విశాఖ పారా స్విమ్మర్లు చాంపియన్‌షిప్‌ను సాధించగా.. కృష్ణా జిల్లా స్విమ్మర్లు ద్వితీయస్థానంలో, శ్రీకాకుళం జిల్లా స్విమ్మర్లు తృతీయస్థానంలో నిలిచారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షణలో పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

అలరించిన చిన్నారుల విన్యాసాలు

పాండురంగాపురంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ హాలులో జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమతుల్యత, బలం, చురుకుదనం, సమన్వయం తదితర అంశాలను కళాత్మకంగా ప్రదర్శించి శాప్ ఎండీ, కలెక్టర్‌లను అబ్బురపరిచారు. చిన్నారులు చేసిన ప్రదర్శనను వీరు ఆసక్తిగా వీక్షించారు. వైఎంసీఏ వద్ద జరిగిన రైఫిల్ షూటింగ్‌లో శాప్ ఎండీ క్రీడాకారుడిగా పోటీ పడ్డారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జిమ్నాస్టిక్స్‌ను ప్రోత్సహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.